క్లుప్తంగా

కంది విత్తనాల అందజేత

పొన్నలూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ టి. పూర్ణచంద్రరావు తెలిపారు. బయోమెట్రిక్ పద్ధతిలో పరిమిత సంఖ్యలో రైతుకు 4 కేజీల చొప్పున కంది విత్తనాలు అందజేస్తున్నామన్నారు. కంది విత్తనాలు కావాల్సిన రైతులు పొలం పాస్ పుస్తకం ,ఆధార్ కార్డు జెరాక్స్‌లతో స్థానిక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ.9,56,222

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,56,222 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.బి శ్రీనివాసరావు తెలిపారు. కుంకుమార్చన రూ.25,320, తలనీలాలు రూ.50,150, ప్రత్యేక దర్శనం రూ.3,06,300, లడ్డూ ప్రసాదాలు రూ.1,62,010, అన్నదానం రూ.3,56,612, రూమ్ అద్దెలు రూ.27,830 కలిపి రూ.9,56,222 వచ్చినట్లు తెలిపారు.

రైజ్ కళాశాలలో రక్తదాన శిబిరం



వల్లూరులోని రైజ్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

టంగుటూరు: మండలంలోని వల్లూరు రైజ్ కృష్ణ సాయి గ్రూపు కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్, జీజీహెచ్ కలిసి సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారని కళాశాల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు అన్నారు. 50 మంది రక్తదానం చేయగా వారికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందించారు. జీజీహెచ్ డాక్టర్ మనీష్ మాట్లాడుతూ రక్తదానం ప్రాధాన్యత, ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. కళాశాల డైరెక్టర్ భాస్కరరావు, ట్రెజరర్ శిద్దా భరత్, చైర్మన్ ఇస్కాల చిరంగమన్నారు, ఎన్‌సీసీ యూనిట్ కోఆర్డినేటర్ సంపత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 115 మందికి ఉద్యోగాలు

ఒంగోలు: స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 115 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చైర్మన్ గోరంట్ల రవికుమార్ పేర్కొన్నారు. డిగ్రీ ఫైనలియర్ పూర్తయిన విద్యార్థులు శనివారం బెంగళూరుకు చెందిన టీచ్‌నూక్, అకెడెమార్ కంపెనీలకు 10 మంది చొప్పున ఎంపికయ్యారని చెప్పారు. వీరి వార్షిక వేతనం రూ.6 లక్షలని తెలిపారు. చెన్నైకి చెందిన టెక్ మహీంద్రా కంపెనీకి 32 మంది విద్యార్థులు ఎంపికవగా, వీరి వార్షిక వేతనం రూ.2.50 లక్షలని వెల్లడించారు. చెన్నైకే చెందిన ఆల్‌సెక్ కంపెనీకి 28 మంది ఎంపికవగా వీరి వార్షిక వేతనం రూ.2 లక్షలని, చెన్నైకి చెందిన ఎడ్యుస్టేషన్ కంపెనీకి 35 మంది ఎంపికవగా, వీరి వార్షిక వేతనం రూ.4 లక్షలని వివరించారు. వీరంతా ఆగస్టు రెండో వారంలో విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్‌తో పాటు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, గిరీష్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

గ్యాస్ క్రిమటోరియంను ప్రారంభించాలి

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ క్రిమటోరియంను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు కోరారు. శనివారం శ్మశానవాటిక వద్ద నగరాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సుమారు రూ.2 కోట్లతో గ్యాస్ క్రిమటోరియం ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. గ్యాస్ క్రిమటోరియం నిర్వహణ విషయంలో నగరపాలక సంస్థ మల్లగుల్లాలు పడకుండా వెంటనే వినియోగం తీసుకురావాలని పౌరసంఘాల సమైక్య సంఘ కన్వీనర్ జి.రమేష్ విజ్ఞప్తి చేశారు. అబ్బూరి లక్ష్మీనారాయణ, సూదనగుంట నరసింహారావు, పసుపులేటి నరసింహారావు, అవిశ హరీష్, మోటుపల్లి వెంకటేశ్వర్లు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉపాధ్యాయుల పదవీ విరమణ కాలం పెంపుపై హర్షం

ఒంగోలు: యూనివర్శిటీల పరిధిలో పర్మినెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సోమశేఖర, డాక్టర్ జ్ఞానేశ్వరరెడ్డి, డాక్టర్ నిర్మలమణి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల యూనివర్సిటీ పరిధిలో అధ్యాపకుల కొరత తీరుతుందని, అదే విధంగా సీనియర్ ప్రొఫెసర్ల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇది కేవలం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి జీతాలు తీసుకునే ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



పామూరులో పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న ముస్లిం, హిందువులు



హనుమంతునిపాడులో పీర్లకు పూజలు



హాజీపురంలో నిప్పుల గుండం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణం చేస్తున్న భక్తులు



హనుమంతునిపాడులో పీర్లు ఎత్తుకొని గ్రామోత్సవం చేస్తున్న భక్తులు



కనిగిరి: సలాములు అందుకుంటున్న పీర్లు

కనిగిరి రూరల్: గత పది రోజులుగా జరుగుతున్న మొహర్రం వేడుకలు శనివారం రాత్రి షహదత్ నామా అల్‌విదాతో ముగిశాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత పెద్ద షరగత్తు వేడుకలతో ప్రారంభమై, పీర్ల గ్రామోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ మకాన్‌లకు చెందిన అక్బర్‌వలి, పాదిలి సాహెబ్, ఇమామే హుస్సేన్, బారాయి మామ్, గిద్దలూరి సాహెబ్, ఇమామే ఖాశిం తదితర నామకరణాలు కలిగిన పీర్ల (హజరత్)ను సుందరంగా తీర్చిదిద్ది పురవీధుల్లో ఊరేగించారు. పీర్ల చావిడ్ల వద్ద శనివారం వేకువ జామున అగ్నిగుండ ప్రవేశాన్ని వీక్షించేందుకు ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. బొడ్డు చావిడి సెంటర్, పామూరు బస్టాండ్‌లలో ×సలాములు× అందుకున్నారు. మధ్యాహ్నం ఆయా మకాన్‌ల వద్దకు పీర్లు వెళ్లాయి. సాయంత్రం పీర్ల చావిడ్ల వద్ద దివంగత మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి మాల కొండయ్య కుమారులు దాసరి మోహన్, దాసరి మురళి భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల్లో కౌన్సిలర్లు సయ్యద్ రిజ్వానా ఖాలక్, దాసరి పద్మ, పెన్నా ఏడుకొండలు, రామనబోయిన శ్రీను, నక్కా రామకృష్ణ, దేవరాజ్, శ్రీ రాం సతీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీర్లు ఊరేగింపుగా బావికి తరలింపు

పీర్లు బావికి తరలించే ఘట్టం శనివారం వైభవంగా జరిగింది. వివిధ పీర్ల చావిడ్ల వద్ద నుంచి తప్పెట్ల, మేళ తాళాలతో, ఊరేగిస్తూ పీర్లను స్థానిక పామూరు రోడ్డులోని పీర్ల బావి వద్దకు తీసుకెళ్లారు. అనంతరం తిరిగి అక్కడి నుంచి పీర్లను ఎత్తుకుని అల్‌విదాయో ..అల్‌విదాషా.. ఏ హుస్సేనీ.. అల్‌విదా..అంటూ గేయాలను ముజావర్లు ఆలపిస్తూ పీర్లను చావిడికి తీసుకుని రావడంతో మొహర్రం ముగిసింది. డీఎస్పీ రత్నాకర రామరాజు పర్యవేక్షణలో సీఐ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై దాసరి ప్రసాద్ భారి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు పలుగ్రామాల్లో పీర్లచావిళ్ళ వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు శనివారం పీర్ల స్నానంతో ముగిశాయి. పామూరులోని మార్కెట్ పీర్ల చావిడి, కందుకూరు రోడ్డులో ఉన్న పీర్లకు ముజావర్‌లు, హిందూ, ముస్లిం సోదరులు పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పీర్లను అందంగా అలంకరించి ఆయా చావిళ్ళవద్ద నుంచి బయలుదేరి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ముజావర్లు షేక్ ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద షరిగత్తు శనివారం ఘనంగా నిర్వహించారు. హాజీపురం, హనుమంతునిపాడు, వాలిచర్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో భక్తులు, మొక్కు బడులు వారు నైవేద్యలు, పూజా సామగ్రితో నిప్పుల గుండం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి పీర్లకు సమర్పించారు. కొబ్బర కాయలు కొట్టి, పీర్ల చావిడిలో కొలువైన పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లను ఎత్తుకొని నిప్పుల గుండంలో నడిచారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా సాగాయి.

వెలిగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండగ ఘనంగా జరిగింది. కంకణంపాడు, వెలిగండ్ల, జంగంనరసాయపల్లి గ్రామాల్లో పీర్లచావిడిని దీపాలతో అలంకరించారు. పీర్ల చావిడిలో పీర్లను అలంకరించారు. శని వారం రాత్రి పీర్లను ఊరేగించారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.



కనిగిరి: బావికి తరలుతున్న వివిధ చావిడ్ల పీర్లు



వెలిగండ్లలో ముస్తాబైన పీర్లు



వెలిగండ్లలో పీర్లచావిడి

అంకమ్మతల్లికి విరాళాల అందజేత



విరాళాలు అందించిన భక్తులతో ఎమ్మెల్యే

కందుకూరు: అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి భక్తులు చూపుతున్న ఔదార్యం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పలువురు భక్తులకు ఎమ్మెల్యేను స్థానిక కార్యాలయంలో కలిసి విరాళాలు అందజేశారు. కొచ్చెర్ల మహీధర్‌బాబు, వెంకటరమణ దంపతులు రూ. 25,116లు, కరేటి సుబ్బారావు, ఈశ్వరమ్మ దంపతులు రూ. 5,116లు అందజేశారు. భక్తులు మనోభావాలకు అనుగుణంగానే ఆలయ నిర్మాణం జరుగుతోందని, కందుకూరు పట్టణానికి సరికొత్త ఆధ్యాత్మిక శోభను ఈ ఆలయం తీసుకొస్తుందని వివరించారు. మాదాల మాల్యాద్రి, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, మాలకొండయ్య, వల్లూరి కోటేశ్వరరావు, గోనుగుంట వేణు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను ఎదిరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దయ్య

కందుకూరు: దేశంలో ప్రస్తుతం కార్పొరేట్ల కనుసన్నల్లో మతోన్మాద పాలన సాగుతోందని, ఇటువంటి అరాచక పాలనకు వ్యతిరేకంగా సీపీఎం ఎత్తున ఉద్యమాలు చేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సిద్దయ్య అన్నారు. సీపీఎం పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులు శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ దేశ సంపదలో 3వ వంతు కేవలం 194 మంది కార్పొరేట్ల దగ్గర ఉందని, మోదీ ప్రభుత్వం వారికి అనేక రాయితీలు కల్పించి దేశ సంపదను ధారాదత్తం చేసిందన్నారు. ఒకే భాష, ఒకే సిద్ధాంతం, ఒకే జాతి, ఒకే మతం అనే ధోరణితో పరిపాలన చేస్తూ దేశం నుంచి వెళ్లిపోండి లేదా హిందూ మతానికి లోబడి ఉండాలనే దుర్మార్గపు పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. హిందువుల్లో కూడా పెద్ద పెట్టుబడి దారులకు మాత్రమే దోచిపెడుతూ మిగతా హిందువులను పావులుగా వాడుకుంటున్నారన్నారు. 40 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించి వేసిందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రతిఘటనా ఉద్యమాలు పెరుగుతున్నాయని, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించి రద్దు చేసుకున్నారని గుర్తు చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని, సీపీఎం ఆధ్వర్యంలో 15 రోజులు పోరుబాట చేపట్టి వేలాది మంది ప్రజలను కదిలించిందని వివరించారు. సీనియర్ నాయకులు జి. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, ఎస్ఏ గౌస్, జీవీబీ కుమార్, ఎస్.కె మున్వర్‌సుల్తానా, కొట్టే వెంకయ్య, కొమరగిరి వెంకటేశ్వర్లు, పొన్నం రామలక్ష్మమ్మ, గుత్తి స్టాలిన్, దువ్వూరి జాన్, డి. రామమూర్తి, ఎస్‌కె మల్లిక, ఎస్. వెంకటేశ్వర్లు, శేషమ్మ, విజయ, ఆష్మా, ఎస్‌డి గౌస్‌బాషా, మాదాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ



అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కందకూరు: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బీఎస్‌పీపి రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతుతో హిందూ మతోన్మాద శక్తులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు రెచ్చిపోతున్నారని, దీనిలో భాగంగానే మణిపూర్‌లో ఆదివాసీలపై దాడులు, మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం వంటి ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ దుర్మార్గపు చర్యలను దేశ బహుజనులు ఖండించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కందుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు బెజవాడ కొండయ్య, బహుజన నాయకులు గాండ్ల హరిప్రసాద్, పాలేటి కోటేశ్వరరావు, చార్వాక, చనమాల కోటేశ్వరరావు, బాంసెఫ్ నాయకులు వెంకట్రావ్, గిరిజన నాయకురాలు చెంచమ్మ, దేవయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీగా పి. నాగులవరం హైస్కూల్



జూనియర్ కాలేజీగా మారిన పి. నాగులవరం హైస్కూల్

వెలిగండ్ల: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యను మారుమూల ప్రాంతాలకు విస్తరింపజేసి అందరికీ అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. హైస్కూల్ స్థాయిలో ఉన్న స్కూళ్లకు జూనియర్ కాలేజీగా గుర్తింపు తెస్తున్నారు. వెలిగండ్ల కస్తూర్బా పాఠశాలను జూనియర్ కాలేజీగా మార్చారు. ఆ పాఠశాలలో బాలికలకు మాత్రమే ప్రవేశం ఉంది. రెండో విడతలో మారుమూల ప్రాంతమైన పి. నాగులవరం హైస్కూల్‌ను నూతనంగా జూనియర్ కాలేజీగా గుర్తింపు ఇస్తూ శుక్రవారం జీవో జారీ చేశారు. ఈ కాలేజీలో కో ఎడ్యుకేషన్‌కు అవకాశం కల్పించారు.



మంచి నిర్ణయం: మారుమూల ప్రాంతమైన పి. నాగులవరం హైస్కూల్‌కు జూనియర్ కాలేజీగా గుర్తింపు కల్పించడం మంచి నిర్ణయం. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆ శాఖ మంత్రులు, విద్యాశాఖ అధికారులతో మాట్లాడి జూనియర్ కాలేజీగా గుర్తింపు తీసువచ్చారు.
దమ్ము చెన్న కేశవులు, గుమ్మళ్లకర్ర

నేడు టైలర్ల ఆత్మీయ సమావేశం

కందుకూరు: నియోజకవర్గ కేంద్రం కందుకూరు టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కందుకూరు ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు పామూరు రోడ్డులోని తిరుమల ఫంక్షన్ హాలులో జరుగుతుంది. ఈమేరకు అసోసియేషన్ నాయకులు షేక్ రఫీ శుక్రవారం తెలిపారు. అందరూ సమావేశానికి హాజరుకావాలని, టైలర్స్ సమస్యలు, ప్రభుత్వ పరంగా రావాల్సిన అనేక పథకాల గురించి ఆ సమావేశంలో చర్చిస్తామని వివరించారు.

రామాలయ వార్షికోత్సవంలో బత్తుల

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్‌లోని రామాలయంలో నిర్వహిస్తున్న వార్షిక వేడుకల్లో శనివారం వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ రావూరి ప్రభావతి, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షులు శీలం రాము తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొండపి: మండలంలోని పెదకండ్లగుంటలో పేకాట ఆడుతున్న శిబిరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిని పట్టుకున్నారు. జూదరుల నుంచి 12,100 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

భైరవకోనలో డీఆర్వో దంపతుల పూజలు



డీఆర్వో దంపతులకు వేద ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్‌వో) శ్రీలత దంపతులు శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. భైరవకోనకు వచ్చిన డీఆర్‌వో దంపతులకు అర్చకులు కంభాలదిన్నె వెంకట నరసయ్య, సుధాకరశర్మ, పంచాగ్నుల రామమూర్తి శర్మ ఘనంగా వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా డీఆర్‌వో దంపతులు జలపాతం దర్శించిన అనంతరం అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు వారిచే శ్రీభైరవేశ్వరస్వామి, త్రిముఖదుర్గాదేవి అమ్మవారు, నగరేశ్వరస్వామివార్ల దర్శనం చేయించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వారిని శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా వారికి ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి ప్రత్యేక వసతి సదుపాయం కల్పించారు. తహసీల్దార్ నాగూర్‌మీరా, ఆలయ ట్రస్ట్‌బోర్డ్ మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి, బసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, వీఆర్‌వోలు ఖాజావలి, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ధ్యాన, జ్ఞాన సప్తాహం



సీఎస్‌పురంలో శాఖాహార ర్యాలీ చేస్తున్న పిరమిడ్ ధ్యానపరులు

సీఎస్‌పురం (పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురం శివాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న ధ్యాన, జ్ఞాన సప్తాహం కార్యక్రమం శనివారం శాఖాహార ర్యాలీతో ముగిసింది. ఈసందర్భంగా పిరమిడ్ మాస్టర్ సౌభాగ్యమ్మ, కార్యక్రమ నిర్వాహకులు పందిటి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నిత్యం వారి వయస్సునుబట్టి అన్ని నిముషాలైనా ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చన్నారు. ధ్యానంతో జ్ఞాన సముపార్జన సాధ్యమని తెలిపారు. నిత్యం ఎన్నో ఒత్తిడులకు గురవుతూ తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారికి ధ్యానం ద్వారా ప్రశాంతత చేకూరుతుందని తద్వారా మానసిక ఒత్తిడిని అధికమించవచ్చన్నారు. అదేవిధంగా మాంసాహారాన్ని దూరం చేసి శాఖాహార భోజనం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని వివరించారు. సీఎస్‌పురం ప్రధాన వీధుల్లో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. పామూరు జీజేసీ ప్రిన్సిపాల్ గుత్తి వెంకట రమణయ్య, పందిటి అల్లూరయ్య, తిరుపతి రెడ్డి, గాంధీ, నర్సారెడ్డి, వెంకటేశ్వర్లు, ఆచారి, యోగానంద్, హైమావతమ్మ, పుష్ప, దుర్గ, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పామూరు, సీఎస్‌పురం, కనిగిరి, వెలిగండ్ల, వింజమూరు, కందుకూరు, ఒంగోలుకు చెందిన ధ్యానపరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో లక్ష్మీనరసింహం

వలేటివారిపాలెం: ట్రాక్టర్ ఢీ- ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన వలేటివారిపాలెం పిరమిడ్ ఎదురుగా శనివారం సాయంత్రం 7 గంటలకు సంఘటన చోటుచేసుకుంది. కొండసముద్రం గ్రామానికి చెందిన ఘట్టమనేని సుబ్బారావు ట్రాక్టర్, పోలినేనిపాలెం గ్రామానికి చెందిన చింతలపూడి లక్ష్మీనరసింహం వలేటివారిపాలెం నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై

కందుకూరు: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని క్షేమంగా పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై హనీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మూడు సంవత్సరాల బాలుడు ఏడుస్తూ తిరుగుతున్నాడు. అదే సమయంలో అటువైపు వచ్చిన కళవళ్ళ గ్రామానికి చెందిన అనిల్, సాయి అనే యువకులు గమనించి బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. స్థానిక మహిళా పోలీస్ పద్మతో పాటు, వలంటీర్ ప్రవల్లికను ఎస్సై అప్రమత్తం చేశారు. వీరు బాలుని తల్లిదండ్రులను గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన దంపతులు కందుకూరు వచ్చి ఓ టీ స్టాల్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఇంటి వద్ద ఆడుకుంటూ బాలుడు తప్పిపోయినట్లు చెప్పారు.